
RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

4లో.

## విద్యుత్ కమిషన్‌కు కొత్త చైర్మన్


WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని

అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

KKR NEWS

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103



సంపుటి - 1 సంచిక - 204 బుధవారం 31 జూలై 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# రైతుకు రుణమాఫీ ఫలాలు అందేలా పక్కడ్బందీ చర్యలు

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి
- రైతులకు ఇబ్బందులు తలెత్తితే గ్రీవెన్స్ పోర్టల్ ద్వార పరిష్కార చర్యలు
- 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు తీసుకున్న రుణాలు, రెన్యువల్స్ మాఫీ
- సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా జరిగిన రైతు రుణమాఫీ రెండవ విడత నిధుల విడుదల
- వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు.

3లో.



## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత కేసు

### విచారణను ఆగస్ట్1కి వాయిదా




హైదరాబాద్, జులై 30,(జర్నలిస్ట్ వార్త): :పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. వాదోపవాదాలు విన్న హైకోర్టు ..తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే విధంగా స్పీకర్ కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు పిటిషనర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలపై ఏలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు గండ్ర. సుప్రీమ్ కోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించగా.. తదుపరి విచారణ ఆగస్టు 1కి వాయిదా వేసింది హైకోర్టు.

# రైతులకు మేలు జరిగింది.. నా జన్మ ధన్యమైంది..

## రైతుల ఖాతాల్లో 12,289 కోట్లు జమ

### సంతోషం వ్యక్తం చేసిన సీఎం రేవంత్

- రుణమాఫీ రెండో విడత నిధులు విడుదల
- రైతు ప్రయోజనాలే ముఖ్యమన్న సీఎం రేవంత్
- 10.84 లక్షల మంది రైతులకు రుణమాఫీ
- రూ.లక్షన్నర లోపు రుణాలన్నీ మాఫీ
- ప్రతి నిమిషం ప్రజల కోసమే ఆలోచన
- పేదలకు మేలు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వ
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2లో.





షూటర్ మను బాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్ డ్ టీమ్ ఈవెంట్ లో సరబ్ జోత్ సింగ్ తో కలిసి కైవసం

# మరో కాంస్యం

హైదరాబాద్ అమరావతి

పారిస్ ఒలింపిక్స్ లో షూటర్ మను బాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్ డ్ టీమ్ ఈవెంట్ లో సరబ్ జోత్ సింగ్ తో కలిసి మరో కాంస్యం కైవసం చేసుకుంది. తద్వారా 124 ఏళ్ల తర్వాత ఒకే ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించిన భారత మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. దీంతో తెలంగాణ,ఎపి ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబులు ఆమెకు ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు..భారత్ తరపున మరో పతకం సాధించిన అథ్లెట్స్ మనుబాకర్ సరబ్‌జోత్ లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం మరెందరికో స్పూర్తి ఇస్తుందని అన్నారు.మను బాకర్ సంధించిన షాట్ చారిత్రాత్మకం అని అభినందించారు చంద్రబాబు . 124 ఏళ్ల తర్వాత ఓ భారత క్రీడాకారిణి ఒకే ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించడం అపురూపం అని కొనియాడారు. ఈ సందర్భంగా మను బాకర్ కు, సరబ్ జోత్ సింగ్ కు హృదయపూర్వకంగా అభినందనలు తెలుపుతున్నానని చంద్రబాబు వెల్లడించారు. భారత షూటర్ల ప్రదర్శన పట్ల గర్విస్తున్నామని తెలిపారు.

# వయనాడ్ విషాదం...

- 600 మంది వలస కార్మికుల ఆచూకీ గల్లంతు ముండక్కైలోని కాఫీ,
- తేయాకు తోటలలో పని కోసం వచ్చిన కార్మికులు
- అసోం, పశ్చిమ బెంగాల్ నుంచి కుటుంబాలతో వచ్చిన కార్మికులు
- వీరు నివాసం ఉంటున్న ప్రాంతంలోనే విరిగిపడిన కొండచరియలు



2లో.

# తెలంగాణకు నిధులిచ్చాం!

- లోక్ సభలో నిర్మలా సీతారామన్
- కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలకు
- పీఎం మిత్ర టెక్స్ టైల్ పార్కులు కేటాయించినట్లు వెల్లడి
- తెలంగాణ, మహారాష్ట్రలలో డబ్లింగ్ పనులకు నిధులు
- ఏ రాష్ట్రానికీ ప్రత్యేకంగా ప్రయోజనం
- చేకూర్చలేదని స్పష్టీకరణ
- తమ నినాదం ఇండియా ఫస్ట్ అని వ్యాఖ్య

2లో.





# రైతులకు మేలు జరిగింది.. నా జన్మ ధన్యమైంది..

**హైదరాబాద్,** జులై 30,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని, అందుకనే రుణమాఫీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతులు బ్యాంకులను మోసం చేస్తున్నారన్న ఆయన.. గత పదేళ్లలో కార్పొరేట్ కంపెనీలు రూ.14 లక్షల కోట్లు ఎగవేశాయని చెప్పారు. కానీ, సాగుకోసం బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు తిరిగి కట్టలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్ల రుణాలను మాఫీ చేస్తోందని చెప్పారు. రెండో విడత పంట రుణాల మాఫీ నిధుల విడుదల సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రైతు రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఇప్పటికే రూ.లక్ష ఉన్నవారికి రుణమాఫీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,40,223 మందికి రూ.6190.01 కోట్లు నిధులు విడుదల చేశారు. మూడో విడత కింద 17, 75, 235 మంది రైతులకు రూ.12,224.98కోట్లు విడుదల చేశారు. రాజకీయ ప్రయోజనం కాదు... రైతు ప్రయోజనం ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు సంతోషంగా ఉండాలని 6మే 2022న వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకటించామని.. గత ప్రభుత్వం 60నెలలు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ కూడా పూర్తిచేయలేకపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.25వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేకపోయిందన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు మాట్లాడారని.. ఎట్టి పరిస్థితుల్లో రుణమాఫీ చేయాల్సిందేనని ప్రణాళికలు రచించాం.. నిధులు సేకరించామని తెలిపారు నిధుల సమీకరణ చేసి ఇవాళ రెండో విడతలో రూ.6,198కోట్లు ఆరున్నర లక్షల మందికి మేలు జరిగేలా చేస్తున్నామని.. ఇది మా చిత్తశుద్ధి, ఇది మా నిబద్ధత అని ప్రకటించారు. నెహ్రూ ఆనాడు హరిత విప్లవం తీసుకు వచ్చారని.. జై జవాన్, జై కిసాన్ నినాదంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్లిందని రేవంత్ తెలిపారు. పేద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయకరణ చేశారని.. సోనియమ్మ నేతృత్వంలో ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఆనాడు రూ.72వేల కోట్లు రుణాలు మాఫీ చేసి దేశంలో రైతులను ఆదుకుంది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. అప్పుడు .. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతేనన్నారు. నెల తిరిగేలోగా 1.5లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామని.. అగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గ నెలలు. దేశ చరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రికార్డు సృష్టించిందన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని.. గత బీఆరెస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ఆరునెలల్లో ఆర్థిక మంత్రి రూ.43 వేల కోట్లు వడ్డీ చెల్లించారని ఆరోపించారు. 12 రోజుల్లోనే రుణమాఫీకి 12వేల కోట్లు సేకరించిన ఆర్థిక మంత్రి, వారి సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున రైతు రుణమాఫీ నిధులు విడుదల చేసేందుకు అసెంబ్లీలోనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు, పంట పొలాలు, పంటలకు సంబంధించిన అంశాలతో ఆకర్షణీయం గా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి కార్యక్రమం పూర్తి చేశారు. గతంలో అనేక మంది రైతులు సొంత పొలంలోనే పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయారు. ఏ రైతు కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోకూడదనేదే మా విధానం. అందుకే ఇవాళ రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశాం. రాష్ట్రంలోని రైతులందరి ఇళ్లల్లో ఇవాళ పండుగ రోజు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశాం. రెండో విడతగా రూ.6,190 కోట్లు మాఫీ చేశాం.' అన్నారు. రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ.6,190 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరింది. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేశారు.గత ప్రభుత్వంలో పూర్తిగా మూలనపడ్డ పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన మంత్రి... ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఒకే పంటకాలంలో రూ.2 లక్షల మేర రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. ఆయిల్‌పామ్ సరఫరాలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ' రైతులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటున్నాం. ఆగస్టులో రూ.2 లక్షల్లోపు ఉన్న రుణమాఫీని కూడా అమలు చేస్తాం. పంటలబీమా ద్వారా రైతులకు అండగా ఉంటాం. త్వరలోనే గతంలో కంటే భిన్నంగా రైతుభరోసా విధివిధానాలు రూపొందిస్తాం. ఐదేళ్లలో 5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేయాలని కోరుతున్నాం. అనేక రాష్ట్రాలకు పామాయిల్ సరఫరా చేసే స్థాయికి మనం చేరాలి. రైతేరాజు అనే నినాదానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్థం చెబుతోందని తుమ్మల అన్నారు. రాహుల్ గాంధీ హామీలు ఇచ్చినప్పుడు అందరూ అనుమానాలు వ్యక్తం చేశారని, వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ రుణమాఫీ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతుల మేలుకోరే రుణమాఫీపై శరవేగంగా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా రెండో విడతగా రుణమాఫీ పొందిన లబ్దిదారులకు ఆయన అభినందనలు తెలిపారు.

# తెలంగాణకు నిధులిచ్చాం!

**హైదరాబాద్,**జులై 30,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ, తమిళనాడు, కేరళ సహా వివిధ రాష్ట్రాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని విపక్షాలు చేస్తున్న విమర్శలపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో స్పందించారు. తెలంగాణ సహా ఏ రాష్ట్రానికి ఏం ఇచ్చామో వివరించారు. దక్షిణాది రాష్ట్రాలకు కేటాయింపులు జరపలేదనడాన్ని ఖండించారు.కర్ణాటక, తమిళనాడు, తెలంగాణలకు పీఎం మిత్ర టెక్స్ టైల్ పార్కులు కేటాయించామని వెల్లడించారు. గ్రీన్ ఫీల్డ్ పార్కులకు రూ.500 కోట్లు కేటాయించామని, బ్రౌన్ ఫీల్డ్ పార్కులకు రూ.200 కోట్లు కేటాయించామన్నారు. బెంగాల్, ఝార?ండ్, బీహార్ రాష్ట్రాలకు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులు ఇచ్చినట్లు చెప్పారు. తెలంగాణ, మహారాష్ట్ర రైల్వే డబ్లింగ్ పనులకు నిధులు కేటాయించామన్నారు.ఏపీ, తెలంగాణలో మోటుమర్రి-విష్ణుపురం సెక్షన్లలో రైల్వే డబ్లింగ్ పనులకు, మడికేర్, మేడ్చల్, మహబూబ్ నగర్, డోన్ మార్గంలో డబ్లింగ్ పనులకు, భద్రాచలం, డోర్నకల్ సెక్షన్లలో రైల్వే పనులకు మొత్తం రూ.12,334 కోట్ల నిధులు ఇచ్చామన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో రూ.1900 కోట్లతో బ్క్ డ్రగ్ పార్కులు ప్రకటించినట్లు చెప్పారు. కేరళ, బెంగాల్ తదితర రాష్ట్రాలకు కూడా నిధులు కేటాయించామన్నారు. తాము ఏ రాష్ట్రానికి ప్రత్యేకంగా ప్రయోజనం చేకూర్చలేదని పేర్కొన్నారు. తమ నినాదం ఇండియా ఫస్ట్ అన్నారు. కమ్యూనిస్ట్ రాష్ట్రం కేరళకు కూడా నిధులు ఇచ్చామన్నారు. ఎన్డీయేకు వరుసగా మూడోసారి అధికారం ఇచ్చినందుకు ప్రజలకు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. మోదీపై ప్రజలు మూడోసారి విశ్వాసం ఉంచారన్నారు. స్థిరత్వం, ప్రజాశ్రేయస్సు విధానాలను తీసుకున్నామన్నారు. వికసిత్ భారత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే తమ ధ్యేయమన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సబ్ కా సాత్ సబ్ కా వికస్ స్ఫూర్తితో బడ్జెట్‌ను ప్రవేశపెట్టామన్నారు. 2009-10 బడ్జెట్‌లో బీహార్, యూపీకి నాటి యూపీఏ ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. ఇప్పుడు బీహార్, ఏపీపై ఆరోపణలు చేస్తున్నవారు దీనికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. 2009-10 బడ్జెట్‌లో 26 రాష్ట్రాల ప్రస్తావన నాటి బడ్జెట్‌లో లేదని విమర్శించారు. 2010-11 బడ్జెట్‌లో 11 రాష్ట్రాలను, 2011-12లో 15 రాష్ట్రాలను, 2012-13లో 16 రాష్ట్రాలను, 2013-14లో 10 రాష్ట్రాలను విస్మరించారన్నారు. నాడు విస్మరించిన వారే ఈరోజు తమను విమర్శించడం విడ్డూరమన్నారు. బడ్జెట్ కేటాయింపులపై కేంద్రమంత్రులు రాష్ట్రాల ప్రజలకు వివరిస్తున్నారన్నారు.

# విద్యుత్ కమిషన్‌కు కొత్త ఛైర్మన్

**హైదరాబాద్,** జులై 30,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మన్‌గా జస్టిస్ మదన్ భీమ్‌రావు లోకూర్ నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన హైకోర్టు సీజేగా, ఆ తర్వాత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా కూడా పనిచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొత్త ఛైర్మన్‌ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఇంతకు ముందు కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి వ్యవహరించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు యాదాద్రి, భద్రాద్రి సబ్‌క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణ చేయడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఛైర్మన్‌గా జస్టిస్



ఎల్.నరసింహారెడ్డిని నియమించారు. విచారణ జరుగుతున్న సమయంలో కమిషన్ ఏర్పాటు, దాని ఛైర్మన్ నిష్పాక్షికతను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని ఆదేశించింది. అదే సమయంలో విచారణ కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌ను సైతం కొట్టేయాలన్న కేసీఆర్ వినతిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కమిషన్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగుతున్నట్లు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తన రాజీనామా లేఖను న్యాయవాది ద్వారా సుప్రీంకోర్టుకు సమర్పించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మంగళవారం నూతన్ ఛైర్మన్‌ను నియమించింది.



# వయనాడ్ విషాదం...

**కేరళ, వయనాడ్ జులై 30,(జర్నలిస్ట్ వార్త):**
కేరళలోని వయనాడ్ జిల్లాలో 600 మంది వరకు వలస కార్మికుల ఆచూకీ గల్లంతైంది. ఇక్కడ కొండచరియలు విరిగిపడి చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ముండకై ప్రాంతంలోని తేయాకు, కాఫీ తోటలలో పని చేసేందుకు పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది మంది కార్మికులు కనిపించకుండా పోయారు.
స్థానికంగా మొబైల్ ఫోన్ నెట్ వర్క్ కూడా పని చేయడం లేదు. ముండకై ప్రాంతంలోని హారిసన్ మలయాళి ప్లాంటేషన్ లిమిటెడ్‌లో పని చేసేందుకు వీరంతా వచ్చారు. వీరు ముండకైలోనే ఉంటున్నారు.మలయాళి ప్లాంటేషన్ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జోన్స్ మాట్లాడుతూ... తమ తోటల్లో పని చేయడానికి వచ్చిన కార్మికులను ఇప్పటి వరకు సంప్రదించలేకపోయామన్నారు. ఇక్కడ మొబైల్ నెట్ వర్క్ కూడా పని చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి నాలుగు వీధుల్లో అసోం, బెంగాల్ నుంచి వచ్చిన 65 కుటుంబాలవారు నివాసం ఉంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. మొత్తం ఇళ్లు ధ్వంసమైనట్లుగా చెబుతున్నారు.

## రెండు రోజులపాటు సంతాపదినాలు

వాయనాడ్ తీవ్ర విషాదం నేపథ్యంలో మంగళవారం, బుధవారం సంతాప దినాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఇప్పటి వరకు 70 మందికి పైగా మృతి చెందారు. ఈ నేపథ్యంలో రెండు రోజులు సంతాప దినాలు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు.

## నదిలో తేలియాడిన మృతదేహాలు

మలప్పురం చలియార్ నదిలో చాలా మృతదేహాలు తేలియాడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. కొండచరియలు విరిగినపడిన స్థలానికి కొన్ని కిలో మీటర్ల దూరంలో 11 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో చాలా వాటికి శరీర భాగాల్లేవు. మూడేళ్ల పాప మృతదేహం కొట్టుకు వచ్చింది. ఇది అక్కడి వారిని అందరినీ కలచివేసింది.

## 80 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం

ఆర్మీ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు 80 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని కేరళ చీఫ్ సెక్రటరీ వి వేణు తెలిపారు. ఈ ఘటనలో 116 మంది వరకు గాయపడ్డారని, వారికి ఆసుపత్రులలో చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు. కేరళకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.5 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

# రైతుకు రుణమాఫీ ఫలాలు అందేలా పక్కడ్బందీ చర్యలు





**వరంగల్ బ్యూరో, జులై 30,(జర్నలిస్ట్ వార్త):**
లక్ష నుండి లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతులకు రెండవ విడత కింద ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నిధులు చేరి, రుణమాఫీ ఫలాలు వరంగల్ జిల్లాలోని రైతులకు వర్తించేలా పక్కడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర అసెంబ్లీ నుంచి శాసన మండల చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రివర్యులు, శాసనసభ సభ్యులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి రైతు రుణమాఫీ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. రైతు రుణమాఫీ 2వ, విడత నిధుల విడుదల కింద లక్షన్నర వరకు రుణాలు ఉన్న 6 లక్షల 40 వేల మంది రైతులకు సంబంధించి 6 వేల 190 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి తన సందేశాన్ని అందజేశారు. రెండవ విడత రైతు రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు.రెండు విడదలలో కలిపి వరంగల్ జిల్లాలో మొత్తం 36 వేల 561 మంది రైతులకు 255.58 కోట్ల రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి తెలిపారు. మొదటి విడత కింద లక్ష రూపాయల వరకు జరిగిన రుణమాఫీ 22 వేల 51 మంది రైతులకు దాదాపు 113 కోట్ల రూపాయల మేర రుణాలు రైతుల ఖాతాల్లో జమచేసి, రుణమాఫీ ఫలాలు రైతులకు అందించామని కలెక్టర్ పేర్కొన్నారు. రెండో విడత లక్షన్నర రుణమాఫీ కింద వరంగల్ జిల్లాలో ఉన్న 14 వేల 510 మంది రైతులకు 142 కోట్ల 58 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వీటిని సైతం వచ్చే వారం రోజులలో రైతులకు పూర్తి స్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతుల రుణాలు రెన్యువల్ చేసి, రుణమాఫీ ఫలాలు రైతులకు అందేలా బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యువల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీ కలిపి 2 లక్షల రూపాయల వరకు ప్రతీ రైతు కుటుంబానికి మాఫీ జరుగుతుందని చెప్పారు. రైతు కుటుంబానికి రెండు లక్షల కంటే అధికంగా రుణం ఉన్నట్లయితే కుటుంబంలోని మహిళ పేరు పై రుణాలు నిబంధనల మేరకు ముందుగా మాఫీ అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. భూమి ఉన్న ప్రతీ రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ పథకం అమలు అవుతుందని అన్నారు. జిల్లాలోని 13 మండలాల రైతుల సౌకర్యార్థం రుణమాఫీపై ఫిర్యాదుల పరిష్కారానికి మండలల్లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ ను సంప్రదించి సమస్యలు నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

భారతదేశ రాజకీయ చరిత్రలో రుణమాఫీ ఒక చారిత్రక ఘట్టమని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. ఇప్పటికే లక్ష రూపాయల రుణం ఉన్నవారికి రుణమాఫీ జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాబోయే కాలంలో తెలంగాణ రైతాంగానికి పంట బీమా, రైతు భరోసా అందించి, రైతే రాజు అనేలా తెలంగాణ రైతాంగం గర్వంగా చెప్పుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, టెస్కాబ్ చైర్మన్, ఆదనవు కలెక్టర్ చేతుల మీదుగా రెండో విడత రైతు రుణమాఫీ చెక్కును రైతులకు అందజేశారు. అనంతరం రుణమాఫీ సందర్భంగా రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉషా దయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, జిల్లా ఉద్యానవనాల అధికారి శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, మండల అధికారులు, పిఎసిఎస్ సొసైటీ ఛైర్మెన్లు, సిఈఓలు, బ్యాంక్ బ్రాంచి మేనేజర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి - పారిశుధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలి**



**వరంగల్ బ్యూరో, జులై 30,(జర్నలిస్ట్ వార్త):**
సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి, వాటి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధులపై కలెక్టర్ సత్య శారదా దేవి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ తదితర శాఖలు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేపట్టాలని, ఎకడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, అన్ని ఇండ్లు, సంస్థల్లో కార్యక్రమాన్ని చేపట్టి, నిల్వ ఉన్న నీటిని బయట పారబోసి, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండల అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి గ్రామాల్లో రోజువారీగా నిర్వహించే పనులను విధిగా చేయించాలన్నారు. తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్యంపై ప్రతిరోజూ నివేదికలు పంపించాలని డీపీవోకు కలెక్టర్ సూచించారు. అధికారులు గ్రామాల వారీగా సందర్శించాలన్నారు. స్వయం సహాయక మహిళ సంఘాల ద్వారా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు నివారణ చర్యలపై చైతన్యం కల్పించాలని డిఆర్డీఓ కు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిణి కౌసల్యదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ వేంకట రమణ, డీఈఓ వాసంతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి హైమావతి, జిల్లా గిరిజన సంక్షేమ, మైనారిటీ శాఖ అధికారి సౌజన్య, జిల్లా బిసి సంక్షేమ అధికారి పుష్ప, జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైలారంలో పడకేసిన పారిశుధ్యం

**- నివాసపు ఇళ్ళ ముందు నిలిచిన వర్షపు నీరు**
**- ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు**



రాయపర్తి, జులై 30,(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలంలోని మైలారం గ్రామంలో అపరిశుభ్రత దర్శనమిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నివాసపు ఇళ్ళ ముందే నీరునిలిచి, దోమలు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని పరిస్థితితో పాటు జాతీయ రహధారిపై మురుగునీరు నిలుస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో గ్రామమంతా అపరిశుభ్రంగా తయారైంది. అపరిశుభ్రత, మురుగునీటి నిలువలు, దుర్వాసనల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించకపోవడంతో రహదారులు బరదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని చెబుతున్నారు. గ్రామ పంచాయతీలలో నిధులు ఉన్నా.. అభివృద్ధి పనులు చేపట్టడానికి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియని సందిగ్ధంలో గ్రామస్తున్నారు. గ్రామపంచాయతీలో సరిపడ సిబ్బంది ఉన్నప్పటికీ పారిశుద్ధ్యం పనులు అంతంత మాత్రంగానే నిర్వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలను సంరక్షించాలని స్పెషల్ అధికారికి గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కార్డెన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు

**- చట్టాలపై తండావాసులకు అవగాహన - చట్ట వ్యతిరేక పనులు చేస్తే చర్యలు తప్పవు - నర్సంపేట ఏసిపి కిరణ్ కుమార్**



నర్సంపేట, జులై 30,(జర్నలిస్టు వార్త): పోలీస్ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నర్సంపేట సబ్ డివిజన్ పోలీసులు నర్సంపేట మండల పరిధిలో మంగళవారం కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజుపేట గ్రామ పరిధిలో ఉన్న గార్లగడ్డ తండాలో సెర్చ్ చేయగా 800 లీటర్ల గుడుంబా తయారీ పానకం, 15 లీటర్ల గుడుంబా, నెంబర్ ప్లేట్ లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం తండవాసులను సమావేశపరిచి వారికి సైబర్ క్రైమ్, నార్కోటిక్ గంజాయి, ట్రాఫికింగ్, డయల్ 100, 1930 సైబర్ క్రైమ్, కొత్త చట్టాలపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనుల పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ గుడుంబా తయారు చేయవద్దని, గంజాయి రవాణా చేయవద్దని, బెల్ట్ షాప్ నిర్వహించకూడదని అన్నారు. వాటి వలన జరిగే నష్టాలను ఏసిపి కిరణ్ కుమార్ తండా వాసులకు వివరించారు. ఫోన్ ద్వారా జరిగే మోసాలపై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట సీఐ రమణమూర్తి, దుగ్గొండి సిఐ రాజగోపాల్, ఎక్సైజ్ సీఐ నరేష్ రెడ్డి, దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు



నర్సంపేట, జులై 30,(జర్నలిస్ట్ వార్త):
నర్సంపేట పట్టణ కేంద్రంలోని పలు మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్ అరవింద్ కుమార్ రెడ్డి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మెడికల్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఔషధాల అమ్మకాల విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. గడువు సరిగ్గా గమనించాలని, పరిధిని దాటి ఎమ్మర్పిలు ఉండే మెడిసిన్ అమ్మకూడదని వివరించారు. లైసెన్స్ గడువును సరిగ్గా చూసుకోవాలని తెలిపారు. నిబంధనలు మేరకు మెడిసిన్ అమ్మాలని ఆదేశించారు.

# అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



పర్వతగిరి, జులై 30,(జర్నలిస్ట్ వార్త): మండల పరిధిలోని కల్లెడ గ్రామంలో మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన చిన్నపాక శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం కల్లెడ గ్రామ అభివృద్ధిలో అంబేద్కర్ యువజన సంఘం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని అన్నారు. అంబేద్కర్ యువజన సంఘం అభివృద్ధికి, అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. అందుకు గ్రామ ప్రజల, సంఘ సభ్యుల సహకారం ఉండాలని కోరారు. సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్న వ్యవస్థాపక కమిటీకి, ప్రస్తుత అంబేద్కర్ యువజన సంఘం సభ్యులకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు ఉప అధ్యక్షులు నక్క రాజు, కార్యదర్శి బుర్కి రవికుమార్, కోశాధికారి యాసరపు సురేశ్, దాసరి రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అంబేద్కర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ, మలేరియా విజృంభణ

- సంతరిస్తున్న వ్యాధులు
- గ్రామ పంచాయతీ సేవలు కరువు
- పరిశుభ్రత లోపించింది
- అపరిశుభ్రత దర్శనమిస్తోంది
- నిష్కారణంగా మలేరియాతో బాలుడి మృతి
- ఇప్పటికైనా గ్రామాల్ని పట్టించుకొనున్నారా..?







**చెన్నారావుపేట, జులై 30,(జర్నలిస్ట్ వార్త):** పంచాయతీల్లో సర్పంచుల పాలన 5 నెలల కిందట ముగిసిపోయింది. ప్రభుత్వం గ్రామలవారిగా పరిపాలన కొనసాగించేందుకు ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గత నాలుగు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన సాగుతుంది .బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాల్లో పరిశుభ్రత పనులు కుంటు పట్టుకుపోయాయి. గ్రామీణ ప్రాంతాల్లో అపరిశుభ్రత దర్శనమిస్తోంది. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. చెన్నారావుపేట మండలం పరిధిలోని గ్రామీణ ప్రాంతాల మెసేజ్ జ్వరాలతో దద్దరిల్లుతున్నాయి. అందుకు నిదర్శనంగా ఇటీవల ఓ బాలుడు విష జ్వరంతో మృత్యువాత పడ్డారు. పరిశుభ్రత పనులు దృష్టి లోపించి, అపరిశుభ పేరుకుపోయి, గ్రామీణ ప్రాంతాలకు వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికుల ఆవేదన వ్యక్తం అవుతుంది. మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు చేపట్టకుండా, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన చేయకుండా, అధికారులు, పారిశుధ్య నిర్వాహకులు ఎక్కడ దొంగలు అక్కడే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు, కొత్త కొత్త అనారోగ్య సమస్యలు తలెత్తుతూ ఉంటాయి. ఇలాంటి సమయంలో పి.హెచ్.సి నిర్వాహకులు జాగ్రత్తగా చర్యలను పాటించాలంటూ కార్యక్రమాలు చేపట్టి, వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి. ఇటీవల వరుసగా కురిసిన వర్షాల కారణంగా, డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాలు గ్రామీణ ప్రాంతాలను భయపెడుతున్నాయి. అలాంటి విష జ్వరాలు బారిన పొడి వయసుతో సంబంధం లేకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పనులపై చర్యలు చేపట్టి, ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు చికిత్సలు అందించి, ప్రజల ప్రాణాలు పరిరక్షించాలని చెన్నారావుపేట మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. విష జ్వరం వ్యాపించి మండలంలోని బోడ మాణిక్యం తండాకు చెందిన13 ఏళ్ల బాలుడు నిష్కారణంగా డెంగ్యూతో మృతి చెందారు. ఆ బాలుడి మృతి విష జ్వరంతో వ్యాపించిన కారణంగా గ్రామాల్లోని పరిశుభ్రతపనులు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన చేస్తూ, అధికారులు సమన్వయం పాటించాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

### పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ
### డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్

ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వల్ల వ్యాధులు వ్యాపించకుండా ఉంటాయని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని బోడ మాణిక్య తండా, చెరువు కొమ్ము తండాలో ఏర్పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాశ్ అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వర సమస్యతో బాధపడుతున్న వారికి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సూర్యపేట తండా, బోజ్య తండాలలో కూడా వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సరోజ, సబ్ యూనిట్ అధికారి నందా, సూపర్ వైజర్ రామెల్, స్టాఫ్ నర్స్ స్వరూపరాణి, వైద్య సిబ్బంది శివాజీ, వెంకటరెడ్డి, సురేందర్, లింగమూర్తి, సరియ, లలిత, కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రాణాలు పోతే తప్ప పట్టించుకోరా..?

ప్రతీ గ్రామంలో గ్రామ పంచాయతీ సేవలు, ప్రాథమిక ఆరోగ్య సేవలు నిరంతరం ఆచరణలో ఉండాలి. గత 18 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాలు బురద మయంగా మారి అపరిశుభ్రంగా తయారయ్యాయి. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామాల్లోని అపరిశుభ్ర వాతావరణం పై ప్రత్యేక దృష్టి సారించి పరిశుభ్రత ప్రమాణాలు చేపట్టాలి, నిరంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు వాతావరణానికి అనుగుణంగా పాటించాల్సిన జాగ్రత్త చర్యల పట్ల ప్రజలకు కల్పిస్తూ ఉండాలి. ఇవేవీ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తూ రెండు శాఖలకు సంబంధిత నిర్వాహకులు నిర్లక్ష్య ధోరణి అలవర్చుకున్నారు. అందువల్లే గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. విషపూరితమైన వ్యాధులు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పడుతున్నా. వచ్చిన జ్వరాలకు వైద్య పరీక్షలు నిర్వహించి సరైన చికిత్సను అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు పట్టి పట్టినట్లు వ్యవహరించడంతో గ్రామాల్లో విష జ్వరాలు వ్యాప్తి చెందాయి. అందుకు నిదర్శనమే బాలుడు మృతిగా స్థానికులు భావిస్తున్నారు. బోడి మాణిక్యం తండాలో ఒక ప్రాణం పోయింది కాబట్టి ఆ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ప్రాణాలు పోతే తప్ప పట్టించుకునే పరిస్థితి లేకపోతే తప్ప, పట్టించుకునే పరిస్థితి ఉండదా..? అంటూ స్థానికులు ముక్కున వేలుసుకుంటున్నారు. ఇప్పటికైనా బాధ్యతాయుతంగా గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు, ఆరోగ్య సంబంధిత పరీక్షలు నిర్వహించి ప్రజలను పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని ఉన్నదా అధికారులను కోరుతున్నారు.

## ఒకే రోజు 17.20 గంటల పాటు సభ

### 8 రికార్డు బద్దలు కొట్టిన తెలంగాణ అసెంబ్లీ



హైదరాబాద్, జులై 30,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అసెంబ్లీ రికార్డులు బద్దలు కొట్టింది. ఒకే రోజు 17 గంటల 20 నిమిషాల పాటు అసెంబ్లీలో చర్చ జరిగింది.బడ్జెట్ పద్దులపై చర్చ జరిగే క్రమంలో..సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. 19 పద్దులపై చర్చ జరిగింది.అధికార, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడారు. వాయిదాలు, వాకౌట్‌లు, నిరసనలు లేకుండా సభ నిరవధికంగా జరిగింది. సోమవారం ఉదయం మొదలైన సభ.. మంగళవారం తెల్లవారు జామున 3.20 గంటల వరకూ కొనసాగింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యధికంగా 12 గంటల పాటు సభ జరిగింది.

## పౌరులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

### - పర్వతగిరి తహశీల్దార్ వెంకటస్వామి

పర్వతగిరి, జులై 30,(జర్నలిస్ట్ వార్త):

సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలని తహశీల్దార్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లెడ గ్రామం ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిమ్న జాతుల వారిని కించపరిచినట్లు మాట్లాడితే చట్ట ప్రకారం శిక్ష అర్హులవుతారని పేర్కొన్నారు. ప్రతీ నెల చివరి రోజున గ్రామాలలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక ఏర్పాటు చేయనున్న శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇచ్చి ఆర్థిక వనరులను కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దళితులకు మూడెకరాల భూమిని కేటాయించాలని, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, సీసీ రోడ్లను నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మార్వోను కోరారు. ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజుతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు ముదురకోల రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండంపెల్లి సైదులు, చినపాక వెంకటయ్య, దాసరి అశోక్, దాసరి లచ్చయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# క్షేమంగా ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చాలి

### - వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్ బ్యూరో, జులై 30,(జర్నలిస్ట్ వార్త):**

ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికులను వారి, వారి గమ్య స్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై వుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మంగళవారం ములుగు రోడ్డులోని వెంకటేశ్వర గార్డెన్ లో వరంగల్ ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో ట్రై సిటి ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా హజరైనారు. ఈ సదస్సులో ముందుగా ఆటో డ్రైవర్లు ఎవిధంగా రోడ్లపై ఏ విధంగా డ్రైవింగ్ చేయాలి, ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలను పాటించాల్సి వుంటుదనే దానిపై ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఆర్.టి.ఓ అధికారులకు సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్లు ఎదుర్కోంటున్న సమస్యలను కూడా పలువురు ఆటో డ్రైవర్లు పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఖాకీ యూనిఫారం ధరించే పోలీస్, ఆటోడ్రైవర్లు ఇరువురు ప్రజలకు సేవలందించేవారమని అన్నారు. ప్రధానంగా నగరంలో ఎంతో మంది డ్రైవర్లు లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్నారు. వీరికి ప్రమాదవశాత్తు ఎద్కైన జరిగితే భీమా నుండి ఎలాంటి లబ్ది రాదని, కావున లైసెన్స్ లేని డ్రైవర్లకు ట్రాఫిక్, ఆర్.టి.ఒ అధికారుల సమన్వయంతో లైసెన్స్‌లు అందించేందుకు పూర్తిగా కృషి చేస్తామని చెప్పారు. నగరంలో తిరిగే ఆటోల సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత ట్రాఫిక్ స్టేషన్లలో వుండే విధంగా ఆటో డ్రైవర్ల యూనియన్ జాగ్రత్త పడాలని సూచించారు. ఆటో డ్రైవర్ల క్షేమంగా కోసం




ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రధానంగా ఆర్థరాత్రి వేళకూడా ట్రై సిటికి వచ్చిన ఇతర ప్రదేశాల నుండి వచ్చే ప్రజలను ఆటో డ్రైవర్లను వారిని క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తారనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలన్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, తమ ఆటోలను నడపాల్సి వుంటుందన్నారు. ఆలాగే రోడ్లపై ఇతర వాహనదారులకు ఇబ్బంది పెట్టేవిధంగా రోడ్లపై ఆటోలను నిలపవద్దని, ఆటో వెనుక భాగంలో ఎలాంటి ప్రచార పోస్టర్లు లేకుండా చూడాలని, దయచేసి సౌండ్ బాక్స్‌లు, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, మీరు చేసే చిన్న పోరపాట్ల వల్ల ఎంతో మంది ప్రయాణికుల ప్రాణాలకు ప్రమాదం పోంచి వుంటుందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ సదస్సులో తమ ఆటో ప్రయాణికులు మరిచిపోయిన ఖరీద్కెన వస్తువులని తిరిగి అందజేసిన ఆటో డ్రైవర్లను పోలీస్ కమిషనర్ సత్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ జాగృతి కళాబృందం సభ్యుల బృందగానం ఆటో డ్రైవర్లను ఆలోచింపజేసినవిగా వున్నాయి. ఈ కార్యక్రమములో ట్రాఫిక్ ఎసిపి సత్యనారయణ, వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్లు రామకృష్ణ, షూకూర్, నాగబాబు, ఆర్.టి.ఓ అధికారులు రమేష్ రాథోడ్, జైపాల్ రెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐలు విజయ్, రామారావు, ఉమాకాంత్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ అవార్డులపై టాలీవుడ్ మౌనం

## సిఎం రేవంత్ రెడ్డి అసహనం




తెలుగు చలనచిత్ర పరిశ్రమ టాలీవుడ్ పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి స్పందన లేకపోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక నంది అవార్డులను గద్దర్ అవార్డులతో భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ కొత్త కార్యక్రమాన్ని ఎలా సమర్ధవంతంగా అమలు చేయాలనే దానిపై అభిప్రాయాన్ని, సూచనలను అందించాలని తెలుగు చిత్ర పరిశ్రమను సీఎం రేవంతరెడ్డి కోరారు. అయితే ఈ విషయంపై సినీ పరిశ్రమ మౌనంగా ఉందని ఆయన అన్నారు.ప్రముఖ తమిళ రచయిత, ఉద్యమకారుడు శివశంకరికి 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం' ప్రదానం సందర్భంగా రేవంత రెడ్డి కామెంట్స్ చేశారు. 'తెలుగు చిత్ర పరిశ్రమలో చేసిన కృషికి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. దీనిపై కార్యచరణ సిద్ధం చేయమని పరిశ్రమను కోరాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవటం బాధాకరం' అని ముఖమంత్రి అన్నారు.

# తెలుగులో శ్రీలీల దూకుడు

తెలుగు నాట వరుస భారీ సినిమాలతో దూసుకుపోతోంది అచ్చ తెలుగు సోయగం శ్రీలీల ఈ యేడు గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దగుమ్మ ఈమధ్య సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి తన ఎడ్యుకేషన్ పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో సెలవు లభించినప్పుడల్లా విహార యాత్రలు చేస్తోంది. ప్రైవేట్ కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొంటోంది.జాగా శ్రీలీల ఓ మ్యాగ్జిన్ కోసం బంగారు వర్ణం డ్రెస్‌లో దర్శనమిచ్చి అహుతులను షాక్‌కు గురి చేసింది.ఇంతకుముందు కన్నా కాస్త గ్లామర్‌ను జత చేసి హోయలు పోతూ తన అభిమానులకు సరికొత్త ట్రీట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.







# నయనతార మందారపువ్వు టీపై వైద్యుడి ఫైర్..

## దీటుగా నయన్ సమాధానం

మందారపువ్వు టీ తాగి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన ప్రముఖ నటి నయనతారపై ఓ వైద్యుడు విరుచుకు పడ్డాడు. ఆ వైద్యుడు మరెవరో కాదు.. ఇటీవల సమంతను విమర్శించిన డాక్టరే. 'ది లివర్ డాక్టర్' అనే ఎక్స్ ఖాతాలో ఆయన పోస్టు పెట్టారు.మందారపువ్వుపై ఆమె తనకున్న 8.7 మిలియన్ల ఫాలోవర్లను తప్పుదోవ పట్టిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సమంత తన ఫాలోవర్లను తప్పుదారి పట్టించిన దానికంటే రెండు రెట్లు ఎక్కువగా నయనతార ఆ పని చేస్తోందని మండిపడ్డారు. మందారపువ్వు టీ బాగుంటుందని చెప్పి వదిలేసి ఉంటే అయిపోయేదని, కానీ ఆరోగ్యానికి సంబంధించిన విషయాలు చెప్పి తన మిడిమిడి జ్ఞానాన్ని జనాలకు కూడా పంచుతున్నారని ఫైరయ్యారు. మందారపువ్వు డయాబెటిస్, హైబీపీ, యాక్నే, యాంటీ బ్యాక్టీరియల్ అంటూ నయనతార చెబుతున్నారని, ఆమె చెప్పిన వాటికి ప్రూఫ్స్ లేవని పేర్కొంటూ, నయనతార పోస్టు ఫొటోలను షేర్ చేశారు.

### ఇంతకీ నయన్ ఏమని చెప్పారంటే..

"మందారపువ్వు టీ నాకు చాలా ఇష్టం. ఇది ఎంతో ఉత్తేజాన్నిస్తుంది. దీనిని ఆయుర్వేదంలోనూ చాలా కాలంగా ఉపయోగిస్తున్నారు. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచుతుంది. శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది కాబట్టి మొటిమలను నివారిస్తుంది. మందారంలో విటమిన్లు సమృద్ధిగా ఉన్నాయి. రోగ నిరోధకశక్తిని సమతుల్యంగా ఉంచుతుంది. సీజనల్ ఇన్ఫెక్షన్, అనారోగ్యం నుంచి రక్షించే యాంటీ బ్యాక్టీరియల్ ఇది. కాబట్టి ఈ టీ తాగండి. ఆరోగ్యంగా, సంతోషంగా ఉండండి" అని నయనతార సుదీర్ఘ పోస్ట్ పెట్టింది.

### తెలివి తక్కువ వారితో వాదించవద్దు

వైద్యుడి విమర్శలపై స్పందించిన నయనతార.. తెలివి తక్కువ వారితో వాదించవద్దు. ఆ విధంగా మిమ్మల్ని వారి స్థాయికి తీసుకెళ్లి ఓడిస్తారు.. అంటూ అమెరికన్ రచయిత మార్క్ ట్వైన్ చెప్పిన సూక్తిని షేర్ చేసింది. అయితే, ఇందులో నేరుగా వైద్యుడిని ప్రస్తావించనప్పటికీ ఆయనను ఉద్దేశించే నయన్ ఈ వ్యాఖ్యలు చేసిందని అంటున్నారు.



# తిరుమల కిషోర్ దర్శకత్వంలో రవితేజ





రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా ఈ ఆగస్టు 15న విడుదలకి సిద్ధం అవుతోంది. హరీష్ శంకర్ దర్శకుడు, ఈ సినిమా అజయ్ దేవగన్ నటించిన హిందీ సినిమా 'ది రైడ్' సినిమాకి అనువాదం. ఈ సినిమా తరువాత రవితేజ దర్శకుడు గోపీచంద్ మలినేనితో సినిమా చెయ్యడానికి ఒప్పుకున్నారు. వారిద్దరి కాంబినేషన్ లో ఇది నాలుగో సినిమా. ఇంతకు ముందు వారిద్దరూ కలిపి 'డాన్ శీను', 'బలుపు', 'క్రేక్' సినిమాలు చేశారు. ఇప్పుడు వీరిద్దరూ కలిపి నాలుగో సినిమాకి శ్రీకారం చుట్టారు, ఇందులో శ్రీలీల కథానాయిక. ఈ సినిమా తరువాత రవితేజ ఇంకొక సినిమా కూడా ఒప్పుకున్నారని తాజా సమాచారం. 'నేను శైలజ' లాంటి మంచి విజయాన్ని అందించిన కిషోర్ తిరుమల ఈ సినిమాకి దర్శకుడిగా పని చేస్తారని తెలుస్తోంది. కిషోర్ తిరుముల చివరి సినిమా 'ఆడవాళ్ళు మీకు జోహార్లు', శర్వానంద్ ఇందులో కథానాయకుడు. ఇది 2022లో వచ్చింది. ఆ తరువాత కిషోర్ తిరుమల తన కథపై పనిచేస్తూ వున్నారని, ఈమధ్యనే రవితేజకి కథని వినిపించడం జరిగిందని కూడా తెలిసింది. కథ నచ్చి రవితేజ సినిమా చెయ్యాలని నిర్ణయించుకున్నట్టుగా కూడా తెలుస్తోంది. అయితే ఈ సినిమాని ఎవరు నిర్మిస్తారు అనే విషయం కూడా కొన్ని రోజుల్లో తెలియనుంది చెపుతున్నారు. కిషోర్ తిరుమల మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు, అలాగే క్లీన్ సినిమాలు నిర్మిస్తారని కుటుంబం అంతా చూసే విధంగా వుంటాయి. కిషోర్ మంచి రచయిత కూడాను. ఇప్పుడు కిషోర్ తిరుమల, రవి తేజ కాంబినేషన్ లో రాబోయే ఈ సినిమా ఒక మంచి కుటుంబ కథా చిత్రంగా ఉండబోతోందని అంటున్నారు.

# తంగలాన్ చిత్రీకరణలో చర్మ సమస్యలు

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా తెరకెక్కిన 'తంగలాన్' చిత్రంలో నటించడం వల్ల చర్మ వ్యాధుల బారిన పడినట్టు మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ తెలిపారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.. దర్శకుడు పా.రంజిత్ కు చెందిన నీలం ప్రొడక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో తెరకెక్కించారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ బంగారు గనుల్లో పనిచేసే తమిళ కూలీల ఇతివృత్తంతో పీరియాడికల్ మూవీగా దర్శకుడు పా.రంజిత్ రూపొందించారు. ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన అనుభవాలను మాళవిక మోహనన్ తాజాగా వివరించారు. 'ఈ మూవీలో వైవిధ్యభరితమైన పాత్రలో నటించాను. వేషధారణ కూడా అలాగే ఉంటుంది. ప్రతి రోజూ మేకప్ వేసుకునేందుకు కనీసం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టేది. ఎర్రటి ఎండల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే నేత్ర సమస్యలతో పాటు చర్మవ్యాధులతో ఇబ్బంది పడ్డాను. దీనికి కారణం.. మండిపోయే ఎండలు. పాత్ర కోసం వాడిన దుస్తులు. వేసిన మేకప్. దాదాపు ఐదారు మంది స్కిన్ స్పెషలిస్టుల (వైద్యులు)ను సంప్రదించాల్సి వచ్చింది' అంటూ మాళవిక మోహనన్ ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన అనుభవాలను వివరించారు.